## క్లుప్తంగా

### విద్యుత్ అభివృద్ధి చార్జీలు రద్దు చేయాలి

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ అభివృద్ధి చార్జీలను రద్దు చేయాలని విద్యుత్ వినియోగదారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చైతన్య డిమాండ్ చేశారు. ఆయన శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ట్రూ అప్ చార్జీలు, విద్యుత్ సుంకం రూపేణా వినియోగదారులపై మోపుతున్న భారం చాలడం లేదా అన్నారు. అభివృద్ధి చార్జీలను పూర్తిగా ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చక్రవర్తిరెడ్డి, శ్రీనివాసమూర్తి, సౌకత్, సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

### గర్భిణులపై ప్రత్యేక దృష్టి



వైద్యసేవలందిస్తున్న వైద్యాధికారి

గుడిపాల: గర్భిణులపై ప్రత్యేక దృష్టి తీసుకుంటున్నట్లు ప్రాథమిక వైద్యాధికారి సంధ్య అన్నారు. పెద్దిశెట్టిపల్లె గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణుల్లో హైబీపీతో ఉండి లివర్, కిడ్నీలపై చెడు ప్రభావం చూపిస్తాయన్నారు. తద్వారా ఒంటిలో నీరు చేరి కాళ్లువాపు వస్తాయన్నారు. వీటన్నింటిపై నివారణకు సంబంధించి అవగాహన కల్పించారు. అనంతరం బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులకు చికిత్సలు చేసి మందులు, మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది విజయ, ఇందు, తేజ, జబసెల్వి, నిరోషా, గౌరమ్మ, నందిని పాల్గొన్నారు.

### ఆవిర్భావ దినోత్సవం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని దర్గాసర్కిల్ శనివారం సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా 17వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్ర నాయకులు అబ్దుల్ గని ముఖ్య అతిథిగా విచ్చేసి పతాకావిష్కరణ చేశారు. సేవా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో కరీం, తౌఫిక్, అబ్దుల్లా, నూరుద్దిన్, షబ్బీర్, సుహెల్, అబ్దుల్ గఫార్ తదితరులు పాల్గొన్నారు.

### ధ్రువపత్రాల పరిశీలన

పలమనేరు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో పాలిసెట్ ధ్రువపత్రాల పరిశీలన శనివారం ప్రారంభమైంది. ఈనెల 28 వరకు షెడ్యూల్ ప్రకారం ఈ కార్యక్రమం కొనసాగుతుందని కళాశాల ప్రిన్సిపల్ సాయిలక్ష్మీప్రసన్న తెలిపారు.

# ఆర్‌బీకేలపై కూటమి కుట్ర

- రేషనలైజేషన్ పేరుతో రైతు సేవా కేంద్రాల కుదింపు
- నిర్వీర్యం చేసేందుకు కొత్త ఎత్తుగడ
- ఇప్పటికే అన్నదాతలకు అందని సేవలు



సీవీపల్లె రైతు సేవా కేంద్రం

ఐరాల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత వైఎస్సార్‌సీపీ హయాంలో తీసుకొచ్చిన ప్రజారంజక విధానాలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటోంది. ప్రజల్లో ఉన్న వైఎస్ జగన్ ముద్రను చెరిపివేయడమే ఈ నిర్ణయాల వెనుక ఉన్న కుట్రలా కనిపిస్తోంది. ఈ జాబితాలో ఇప్పటికే సచివాలయాలు చేరగా, తాజాగా రైతు సేవా కేంద్రాలు (ఆర్‌ఎస్‌కే) చేరాయి. రేషనలైజేషన్ పేరిట కూటమి ప్రభుత్వం వీటిని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిన రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌ఎస్‌కేలు) కూటమి ప్రభుత్వ తీరుతో త్వరలో కనుమరుగు కానున్నాయి. ఉన్న ఊళ్లోనే రైతులకు అన్ని రకాల సేవలు అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేశారు. వీటి ద్వారా పంటల సాగుకు అవసరమైన అన్ని రకాల సేవలు అన్నదాతలకు సకాలంలో అందేవి. పంటల సాగులో సూచనలు, సలహాలు అందించడంతో పాటు విత్తనాలు, ఎరువులు అందించేందుకు చర్యలు తీసుకునేవారు. పండిన పంటలకు కూడా గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేసేవారు. తద్వారా రైతులకు ఎంతో మేలు జరిగేది. అయితే అలవి కాని హామీలిచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చి, ఈ వ్యవస్థనే నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతోంది. రేషనలైజేషన్ పేరుతో కేంద్రాలను కుదించేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే ఉన్న సిబ్బందిని సర్దుబాటు పేరుతో ఇతర సంస్థలకు బదలాయించేందుకు చర్యలు తీసుకుంటోంది. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కోవలసిన పరిస్థితి నెలకొంది.

### కర్షకుల సేవలకు బ్రేక్

కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. సాగుకు అవసరమైన రాయితీ విత్తనాల పంపిణీ ఆగిపోయింది. సబ్సిడీపై ఎరువులను నామమాత్రంగా అందించారు. అది కూడా రైతు సేవా కేంద్రాల ద్వారా కాకుండా సహకార సంఘాల ద్వారా విక్రయాలను చేపట్టారు. ఈ ఏడాది చివరిలో యూరియా అందక రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. తాజాగా రేషనలైజేషన్ పేరుతో రెండు వేల ఎకరాలు సాగులో ఉండే గ్రామాల్లో మాత్రమే రైతు సేవా కేంద్రాలను కొనసాగించాలని నిర్ణయించి కుదింపు అమలుకు శ్రీకారం చుట్టారు. ఆ మేరకు నివేదికలు సిద్ధం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయితే మండలంలో చాలా రైతు సేవా కేంద్రాలు తగ్గిపోనున్నాయి. ఐరాలలో 18 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఇందులో వీఏఏల 5 మంది, వీహెచ్ఏలు 3, ఏఈఓలుగా ఇద్దరు విధులు నిర్వహిస్తున్నారు. రేషనలైజేషన్ పేరుతో ఇందులో సగం మందిని ఇతర శాఖలకు పంపించేస్తే మిగిలిన సిబ్బందితో రైతులకు సేవలు అందించడం కష్టంగా మారనుంది.

#### వ్యవసాయం దండగలా మార్చేశారు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం పండగలా మారింది. గ్రామాల్లోనే ఆర్బీకేలు ఏర్పాటు చేయడం ద్వారా విత్తు నుంచి విక్రయం వరకు అన్నీ అందుబాటులో ఉండేవి. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి స్థానికంగానే కొనుగోలు చేసేవారు. ఈ ఐదేళ్లు మాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. అన్నదాతకు అండగా నిలిచిన రైతు సేవా కేంద్రాలను కుదిస్తే వ్యవసాయం దండగ అనే భావన మళ్లీ మొదలైంది. రైతు సేవా కేంద్రాలను కూటమి ప్రభుత్వం కొనసాగించి అన్నదాతకు అండగా నిలవాలి.

– ప్రతాప్‌రెడ్డి, రైతు, 35 యర్లంపల్లి, ఐరాల

#### కేంద్రాలను కుదించడం సరికాదు



గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా అనేక ప్రయోజనాలు పొందాం. విత్తనాలు, ఎరువులు, సాగుకు అవసరమైన అన్ని సేవలు ఊళ్లోనే అందేవి. వ్యవసాయ శాఖ సిబ్బంది కూడా అందుబాటులో ఉండి పంటలకు ఏమైనా తెగుళ్లు, పురుగు ఆశించిందని చెప్పిన వెంటనే పొలానికి వచ్చి చూసేవారు. అలాంటి కేంద్రాలను కుదించడం సరికాదు. ఇప్పుడు పురుగు మందులు, విత్తనాలు కొనుక్కోవాలంటే దుకాణాలకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. విత్తనాల నాణ్యత తెలుసుకోవడం కష్టంగా మారుతుంది.

– సురేంద్రయాదవ్, రైతు, పెద్దగొల్లపల్లె, ఐరాల

### ఘనంగా అక్కమ్మ దేవత తిరునాళ్లు



గెరిగను ఊరేగిస్తున్న భక్తులు

గుడిపాల: మండలంలోని రామభద్రాపురం గ్రామంలో ఉన్న గ్రామదేవత అక్కమ్మ దేవత తిరునాళ్లు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి అభిషేకం నిర్వహించి, విరుపాక్షమ్మ దగ్గర పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మేళతాళాలు మధ్య, బాణసంచావేడుకలతో వైభవంగా ఉత్సవమూర్తులు అమ్మవారి గెరిగలను జోడించి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొల్ల హరిప్రసాద్, గ్రామస్తులు సురేంద్రబాబు, అమరేంద్రబాబు, వరదరాజులు, సురేంద్రనాయుడు, శ్రీధర్, ధనంజయ, గోవర్ధన్, వినాయక, నరసింహ, మనుమంతనాయుడు, సందీప్, చరణ్ పాల్గొన్నారు.

## అతిసార నివారణపై అవగాహన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సంధ్య, వైద్య సిబ్బంది

గుడిపాల: అతిసార నివారణపై శనివారం గుడిపాల వైద్యాధికారి సంధ్య ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ తరచూ చేతులు శుభ్రం చేసుకోవడంతోపాటు ఇంటి చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ముఖ్యంగా దోమలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది విజయ, చంద్రశేఖర్, సెల్వి, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## కట్టమంచిలో రోడ్డు ఆక్రమణ తొలగింపు



చిత్తూరు అర్బన్: హైరోడ్డు విస్తరణలో భాగంగా శనివారం చిత్తూరు నగరంలోని కట్టమంచిలో రోడ్డు ఇరుపక్కలా శనివారం విస్తరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా ఏసీపీ నాగేంద్ర ఆధ్వర్యంలో ప్రణాళిక విభాగం అధికారులు కట్టమంచి ప్రాంతంలో వెంకుశ కల్యాణమండపం ఎదురుగా రోడ్డును ఆక్రమించుకున్న దుకాణాలను జేసీబీ సాయంతో తొలగించారు. కార్యక్రమంలో టీపీవోలు, ప్రణాళిక సిబ్బంది పాల్గొన్నారు.

# నిత్యం యోగా సాధన అవసరం





చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో యోగాసనాలు వేస్తున్న సిబ్బంది, బంగారుపాళెం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

చిత్తూరు కార్పొరేషన్/గుడిపాల/కాణిపాకం/బంగారుపాళెం/ఐరాల/తవణంపల్లె: నిరంతర యోగా సాధనతో ఆరోగ్యకరమైన లాభాలను పొందవచ్చని డీఎఫ్ఓ భరణి, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషశ్రీ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని నగరవనంలో, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగాపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎఫ్ఆర్వో థామస్, వాకర్స్ అసోసియేషన్ రీజనల్ కౌన్సిలర్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. పూతలపట్టులోని పి.కొత్తకోట సీహెచ్‌సీలో కూడా కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలు నాటారు. తర్వాత యోగాసనాలు చేశారు. అపోలో కాలేజీలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. గుడిపాల మండలం బొమ్మసముద్రం జూనియర్ కళాశాల ఆ ప్రిన్సిపల్ సబ్జాన్ ఆధ్వర్యంలో, సీఎన్ఆర్ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేశారు.

### యోగాతో మానసిక ప్రశాంతత

యోగా సాధనతో మానవ దైనందిన జీవితంలో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు, ఎంపీడీఓ మహేష్, హెచ్ఎం రాజేంద్ర, నాయకులు పాల్గొన్నారు. స్థానిక పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగా దినోత్సవాన్ని ప్రిన్సిపల్ వందనాత్రిపాఠి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపల్ బేబీశ్వర్‌రెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సీతాపతినాయుడు ఆధ్వర్యంలో యోగాంధ్రా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో యోగాసనాలు, ధ్యానం చేయించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ విజయ్‌కుమార్, రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తవణంపల్లె మండలంలోని అన్ని సచివాలయాల్లో అంతర్జాతీయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పల్లెచెరువు సచివాలయంలో ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, దిగువమోదలపల్లె మోడల్ స్కూల్లో ఎంఈఓ హేమలత యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాసనాలు చేయించారు.



ఐరాల: ఆసనాలు వేస్తున్న విద్యార్థులు



చిత్తూరు: ధ్యానం చేస్తున్న డీఎఫ్ఓ భరణి, విద్యార్థులు

### జీవితంలో యోగా భాగం కావాలి

చిత్తూరు కలెక్టరేట్ : యోగా ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని బృందావన్ సీబీఎస్ఈ పాఠశాల చైర్మన్ విజయభాస్కర్‌రావ్, చైర్మన్ శైలజాకుమారి అన్నారు. నగరంలోని సంతపేట వద్ద ఉన్న బృందావన్ సీబీఎస్సీ పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ యోగా దినోత్సవం ను పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. సంతపేట నుంచి గాంధీ బొమ్మ వరకు ర్యాలీ నిర్వహించి యోగా పై అవగాహన కల్పించారు. ఆ పాఠశాల డైరెక్టర్ ప్రియ తేజా, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.




ర్యాలీ ప్రారంభిస్తున్న బృందావన్ పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్లు